క్లుప్తంగా

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

నేలకొండపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన అవసరమైన స్ట్రాంగ్ రూమ్‌ను మండలంలోని కొత్తకొత్తూరు ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేయగా.. తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, స్థానిక ఎస్సై పి.సంతోష్‌లు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వసతులపై ఆరా తీశారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌కు అవసరమైన సౌకర్యాలపై పాఠశాలను ఎంపిక చేసేందుకు జిల్లా అధికారుల అనుమతి తీసుకునేందుకు నివేదిక పంపినట్లు అధికారులు తెలిపారు.

వ్యాన్ డ్రైవర్‌పై దాడి

రఘునాథపాలెం: మండలంలోని వాంకుడోత్ తండాలో బొలెరో వ్యాన్ డ్రైవర్ సాయిపై అదే గ్రామానికి చెందిన వి.సేవాలాల్ దాడి చేసినట్లు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. వ్యాన్ కిరాయికి రావాలని సాయిని మంగళవారం సేవాలాల్ అడిగాడు. దీంతో గతంలో ఇవ్వాల్సిన కిరాయి ఇవ్వకుండా మళ్లీ కిరాయికి రాను, తనకు మరో కిరాయి ఉందని చెప్పినందుకు, తనపై దాడి చేసినట్లు ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బియ్యం వితరణ

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకలో ఇటీవల అనారోగ్యంతో శ్రావణి మృతిచెందింది. ఈనేపథ్యాన మంగళవారం మృతురాలి కుటుంబానికి కోయచలక కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ వంతు సాయంగా 50 కేజీల బియ్యం అందించినట్లు మాజీ ఉపసర్పంచ్ చెరుకూరి పూర్ణ తెలిపారు.

ఆంబోతుకు అంత్యక్రియలు

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్లలో మంగళవారం ప్రమాదవశాత్తు ఓ ఆంబోతు బావిలో పడి మృతి చెందింది. దీంతో గ్రామస్తులు సంప్రదాయ పద్ధతిలో ఊరేగించి గ్రామ శివారులో అంత్యక్రియలు నిర్వహించారు.

విద్యార్థినులకు ప్లేస్‌మెంట్స్



ఆఫర్ లెటర్లతో విద్యార్థినులు

ఖమ్మంసహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకామ్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు హైదరాబాద్‌లోని గ్రాండ్‌గురు ఎడ్యుటెక్ కంపెనీలో ప్లేస్‌మెంట్స్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.పద్మావతి తెలిపారు. టీఎస్‌కేసీ అండ్ టాస్క్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులు కె.ఇందు, బి.లలిత, టి.నవ్య, స్వాతి, యు.దివ్య, పి.సుజాత, బి.శ్రీదేవి, ఎస్.పావని, జి.మౌనికలు బిజినెస్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌లుగా ఉద్యోగం సాధించారన్నారు. వీరికి మంగళవారం ప్రిన్సిపాల్ ఆఫర్ లెటర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ కేసీ అండ్ టాస్క్ కోఆర్డినేటర్ వేముల రామారావు, మెంటార్ సీహెచ్.కవిత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ విద్యార్థులకు..

ఖమ్మంసహకారనగర్: గత వారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్యాంపస్ పూల్ డ్రైవ్‌లో తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ ఇన్ఫోసిస్ లిమిటెడ్‌లో ఉద్యోగాలు సాధించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎస్. శ్రీనివాసరావు, సవిత, ప్రభాకర్ పాల్గొన్నారు.

వెలుగుమట్లలో గురుకుల విద్యార్థినుల సందర్శన


నేలకొండపల్లి: పీఎం శ్రీ పథకంలో భాగంగా నేలకొండపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు మంగళవారం నగరంలోని వెలుగుమట్లలో గల బొటానికల్ గార్డెన్‌కు క్షేత్రస్థాయి సందర్శనకు వచ్చారు. ఈ సందర్భంగా మొక్కల ఆవశ్యకత, పీఎం శ్రీ పథకం ముఖ్య ఉద్దేశం తెలుసుకుని ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

ఖమ్మం మామిళ్లగూడెం: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమని, మూడు దశాబ్దాల వర్గీకరణ సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం ముగింపు పలికిందని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు సీపీఐ మొదటి నుంచి మద్దతుగా నిలిచిందని గుర్తు చేశా రు. ప్రస్తుత కులగణన ప్రకారం అన్ని వర్గాలవారికి లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలని, జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా మోదీ ప్రభుత్వం కుల గణన చేపట్టాలన్నారు.

ఎన్నికలకు సంసిద్ధం..

- చకచకా ఎన్నికల ఏర్పాట్లు
- బ్యాలెట్ పేపర్ల పరిశీలనలో మండల పరిషత్ సిబ్బంది
- అధికారుల సమీక్షలు, సమావేశాలు



రఘునాథపాలెం: ఎంపీడీఓ కార్యాలయంలో బ్యాలెట్ పేపర్ల పరిశీలనలో ఎంపీడీఓ, ఉద్యోగులు

రఘునాథపాలెం: స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు మండల పరిషత్ కార్యాలయాల్లో కార్యాలయ ఉద్యోగులు గత రెండు రోజులు నుంచి పనుల్లో నిమగ్నమయ్యారు. ఈనేపథ్యాన మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలకు, 308 వార్డులకు, 13 ఎంపీటీసీల పరిధిలో ఎన్నికలను నిర్వహించడానికి అవసరమైన సమాచారం, వివరాలను నమోదు ప్రక్రియలో ఎంపీడీఓ అశోక్‌కుమార్ తన సిబ్బంది చకచకా పనులు సాగిస్తున్నారు. మొత్తం ఓట్లు, వాటిలో గతంలో పాలక వర్గం సమయాన కొనసాగిన రిజర్వేషన్ల ప్రక్రియ తదితర వాటిపై సమగ్ర సమాచారంతో డీపీఓ, జెడ్పీ సీఈఓల సమక్షంలో ఎన్నికల పనులు సాగిస్తున్నారు. పోలింగ్ కోసం అవసరమైన బూత్‌లు, వాటి పరిధిలో అవసరమైన పోలింగ్ సిబ్బంది తదితర సమాచారం సైతం సర్వ సిద్ధం చేస్తున్నారు.

పార్టీల నాయకులతో సమావేశం..

తిరుమలాయపాలెం: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యాన మంగళవారం తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సిలార్ సాహెబ్ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుది ఓటర్ జాబితాను విడుదల చేశారు. 40 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 50,723 మంది ఓటర్లు ఉండగా.. పురుషులు 24,493 మంది, మహిళలు 26,230 మంది ఉన్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమనపల్లి వెంకటేశ్వర్లు, నామ ప్రసాద్, శ్రీను, రాధాకృష్ణ ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ తిగుళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న ఎంపీడీఓ సిలార్‌సాహెబ్

ఎన్నికలకు సహకరించండి..

నేలకొండపల్లి: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో మూడు దశలుగా నిర్వహించిన ప్రత్యేక ఓటు నమోదులో మొత్తం 32 గ్రామపంచాయతీల నుంచి 50,103 ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి బి.చలపతిరావు, చెరుకు అభివృద్ధి మండలి మాజీ చైర్మన్ నెల్లూరి లీలాప్రసాద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, మరికంటి రేణుబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ ఇన్‌చార్జ్ పసుమర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు బొందయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, కడియాల నరేష్, గుడిబోయిన వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నేలకొండపల్లి: సూచనలు చేస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

కార్మికుల సంక్షేమానికి చట్టం చేయాలి

రఘునాథపాలెం: భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకు సమగ్రమైన సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మీనారాయణ, తోట రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బూడిదంపాడులో జరిగిన మార్బుల్స్ వర్కర్స్ యూనియన్ మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 2009లో సంక్షేమ బోర్డు అమలులోని వచ్చిందని, తెలంగాణ బోర్డులో నమోదైన 18 లక్షల మంది కార్మికులకు సెస్ ద్వారా బోర్డుకు అందే 2,500 కోట్లపైగా రూపాయలలో ఒక శాతం కార్మికుల సంక్షేమానికి ఉపయోగించాలన్నారు. కాగా, రాష్ట్రంలో గత ఆరేళ్లుగా సంక్షేమ బోర్డుకు పాలకవర్గం లేకపోవడంతో ఏఐటీయూసీ డిమాండ్‌తో కార్మిక సంఘాల నుంచి సభ్యులతో బోర్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందన్నారు. మార్చి 1న ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెంలో జరిగే జిల్లా మహాసభల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించి తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పిట్టల మల్లయ్య, తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మటూరు రామకృష్ణ, మార్బుల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకుడు మందా నాగేశ్వరరావు, మండల నాయకులు రాంబాబు, గురువయ్య, నరేష్, నాగరాజు, ఉపేందర్, వీరకృష్ణ, సంగయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ


నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నగర కమిటీ ప్రమాణ స్వీకారం మంగళవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. నగర అధ్యక్షుడిగా యలమందల జగదీష్, ప్రధాన కార్యదర్శిగా గుండ్లపల్లి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ సమక్షంలో నాయీ బ్రాహ్మణుల సమస్యల కోసం ఓ టోల్ ఫ్రీ నంబర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చావా నారాయణరావు, శీలంశెట్టి వీరభద్రంలతో పాటు సంఘం బాధ్యులు, నాయకులు ఎం.లింగం, గుంజపడుగు హరిప్రసాద్, మానాల కిషన్, తూముల నాగభూషణం, ఆలేటి సత్యనారాయణ, నంద్యాల నర్సింహారావు, రావులపాటి శ్రీనివాస్, నంద్యాల రాము, సూరభి సైదులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో పాఠశాలల విద్యార్థులకు పతకాలు



సాధించిన పతకాలు, ప్రశంసాపత్రాలతో వికాస్ స్కూల్ విద్యార్థులు

ఖమ్మంసహకారనగర్: ఏబీఎస్‌సీఓ క్లబ్ ఖమ్మంలో నిర్వహించిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని వికాస్ స్కూల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. అండర్-14 బాలుర, బాలికల విభాగంలో టి.రిషిక్ శ్రీహాస్, ఎస్.మోక్షశ్రీ, బి.తక్షీల్, ఎ.శ్రీజిత్, శ్రీహాస్, షణ్ముఖ నందన్‌లు బంగారు పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను వికాస్ స్కూల్ ప్రిన్సిపాల్ వై.లావణ్య అభినందించారు. అదేవిధంగా నగరంలోని సైదులు కరాటే స్కూల్ విద్యార్థులు, న్యూఇరా, సర్వజ్ఞ, రెజొనెన్స్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటి పతకాలు సాధించగా.. ఆయా యాజమాన్యాలు పాఠశాలలో వారిని అభినందించారు.

యాదవులకు నగదు బదిలీ చేయాలి

కూసుమంచి: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని ప్రతీ యాదవుడికి గొర్రెల పంపిణీలో భాగంగా రూ.2లక్షల నగదు బదిలీ చేయాలని తెలంగాణ యాదవ సంఘ జిల్లా అధ్యక్షుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం డిమాండ్ చేశారు. మంగళవారం పాలేరులో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరా మార్కెట్ మాజీ చైర్మన్ గుమ్మా రోషయ్య, యాదవ్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బారి మల్సూర్, జిల్లా కన్వీనర్ కోడి లింగయ్య, కార్పొరేటర్ ముక్కల కమల, నాయకులు దాసరి వెంకన్న, జడ మల్లేష్, శ్రీశైలం, కృష్ణయ్య, బడేటి శ్రీనివాస్, ఉప్పయ్య, రాము, లింగమల్లు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

ఖమ్మంఅర్బన్: విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసేలా నూతనంగా చేరిన ఉపాధ్యాయులు కృషి చేయాలని ఖమ్మం అర్బన్ ఎంఈఓ శైలజాలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల విద్యా వనరుల కేంద్రంలో పీఆర్‌టీయూ ఆధ్వర్యాన నిర్వహించిన డీఎస్సీ 2024 నూతన ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ల ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులందరికీ సంఘ డైరీలను అందించారు. పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు గుడిపుడి శ్రీనివాసరావు, బి.రవికిరణ్, ఉపాధ్యాయులు అచ్యుతరావు, ధనలక్ష్మి, మురళీకృష్ణ, నవీన్‌కుమార్, షైజా పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన ..

ఖమ్మంసహకారనగర్/నేలకొండపల్లి : మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యాన మంగళవారం టైనిటాట్స్ స్కూల్‌లో 'చిన్నారి'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు సంబంధించిన అంశాలు, బాల్య వివాహాలు, మంచి చెడు స్పర్శలు, మాదక ద్రవ్యాలు, ఇంటర్‌నెట్ దుర్వినియోగం, పిల్లల అక్రమ రవాణ, పిల్లల శరీరంలో వచ్చే మార్పులు, లైంగిక వేధింపులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మెడికల్ ఆఫీసర్ దుర్గాభవాని, శిశుసంక్షేమ శాఖ జండర్ స్పెషలిస్ట్ ప్రమీల, పాఠశాల కరస్పాండెంట్ శెట్టి భాస్కర్, ఉపాధ్యాయులు సబిత, సంధ్య, నాజియ, ఝాన్సీ, నపర, జ్యోతి, అలేఖ్య పాల్గొన్నారు. అలాగే నేలకొండపల్లి మండలం బోదులబండ పాఠశాలలో స్కోప్ ఆర్గి మై చాయిసెస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన విద్యార్థులకు పోలీస్ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బాధ్యుడు నరసింహారావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బోదులబండ వైద్యాధికారి గీత, సుజాత, హెచ్ఎం.నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరి పైరు పరిశీలన

రఘునాథపాలెం: మండలంలోని కోయచలకకు చెందిన పలువురు రైతులు ప్రముఖ కంపెనీకి చెందిన వరి విత్తనాలతో సాగు చేయగా ముందస్తుగా కంకులు వేయడంతో ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యాన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో మంగళవారం వ్యవసాయ అధికారులు, కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. విత్తన లోపంతోనే ఇలా జరిగిందని రైతులు తెలిపారు. ఈమేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడమే కాక మొక్కలను ల్యాబ్‌కు పంపిస్తామని వారు పేర్కొన్నారు. ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈఓ కార్తీక్, ఆత్మ కమిటీ ఖమ్మం డివిజన్ చైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, రఘునాథపాలెం సొసైటీ చైర్మన్ తాత రఘురాంతో పాటు కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్ శిక్షణ

ఖమ్మం మామిళ్లగూడెం: మాజీ ఎమ్మెల్యే బోడిపూడి వెంకటేశ్వరరావు పేరుతో ఖమ్మం సుందరయ్య భవన్‌లో బోడిపూడి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ట్రస్ట్ మేనేజర్ వై.శ్రీనివాసరావు, సీఐటీయూ నాయకుడు యర్రా శ్రీకాంత్, వై.విక్రమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు నెలల పాటు శిక్షణ నిర్వహించి మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందజేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, అఫ్జల్, వాసిరెడ్డి వీరభద్రం, బి.సుదర్శన్, గోవిందరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు



డ్రెయినేజీలను శుభ్రం చేస్తున్న కార్మికులు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 4వ, 22వ, 52వ డివిజన్లలో మంగళవారం గ్యాంగ్‌వర్కర్లతో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వర్తించారు. ఈ సందర్భంగా రోడ్లు శుభ్రం చేయడం, డ్రెయినేజీల్లో వ్యర్థాలను ఎత్తడం, ఖాళీ స్థలాలను శుభ్రం చేశారు. అదేవిధంగా నగరంలోని సుందరయ్యనగర్‌లో గోళ్లపాడు చానల్ వద్ద అనుమతులు లేకుండా అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారులు అడ్డుకున్నారు. బెస్‌మెంట్, పిల్లర్లను సిబ్బంది తొలగించారు. అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించడంతో పాటు నిర్మాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీల ఆవిష్కరణ

రఘునాథపాలెం: మండలంలోని చిమ్మపుడిలో మండల మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవి ఆధ్వర్యాన రఘునాథపాలెం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు వీరునాయక్, మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు మధంశెట్టి హరిప్రసాద్‌తో కలిసి బీఆర్ఎస్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపాలన పేరుతో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. రైతుల పంటలకు దిగుబడి, గిట్టుబాటు ధరలు కల్పించలేక విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు గుండ్ల ముత్తయ్య, కాళంగి వీరబాబు, మద్దుల నాగేశ్వరరావు, రాచర్ల రామ్మూర్తి, పోతరాజు రమేష్, గంగిరెడ్డి విజయ్, గాదె వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అక్షరాల తోవ' వార్షికోత్సవ పోస్టర్లు..

ఖమ్మంగాంధీచౌక్: ఈ నెల 9న నగరంలోని జెడ్పీ మీటింగ్ హాల్‌లో జరిగే అక్షరాల తోవ 7వ వార్షికోత్సవ వాల్ పోస్టర్లను నగరంలోని న్యూ ఇరా పాఠశాలలో నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పురస్కారాలు అందించడంతో పాటు పలు పుస్తకావిష్కరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కవి మువ్వా శ్రీనివాసరావు, సామాజిక విశ్లేషకులు ఐవీ రమణారావు, నిర్వాహకులు నామా పురుషోత్తం, దాసరోజు శ్రీనివాస్, రాచమళ్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రం..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల ప్రభుత్వ పాఠశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న పదో తరగతి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకుడు బాగం హేమంతరావుతో కలిసి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభా పరీక్షలు ద్వారా మానసిక ధైర్యాన్ని పెంచుకుని ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు. అనంతరం బాగం హేమంతరావు మాట్లాడుతూ.. విద్యార్థి సమస్యలపై పోరాడడంతో పాటు పాటు విద్యార్థుల విద్యాభివృద్ధికి సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మడుపల్లి లక్ష్మణ్, ఇటికాల రామకృష్ణ, మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, వై.వీ. సంఘ నాయకులు నాగులమీరా, శివనాయక్, వంశీ, హరికృష్ణ, మనోజ్, గోపి, రోహిత్, ఉస్మాన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ డైరీ అందజేత

ఖమ్మంవన్‌టౌన్: తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం హెచ్-1 యూనియన్ డైరీని గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు సంఘం నాయకులు అందజేశారు. కాంగ్రెస్ జిల్లా నాయకుడు కన్నం ప్రసన్నకృష్ణ, జిల్లా అధ్యక్షుడు వి.కృష్ణారావు, సందీప్, సురేష్, నిర్మలా జ్యోతి, శివ, జ్యోతిరత్న, రాజ్యలక్ష్మి, రామకృష్ణ, ఉన్నారు.

ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలం

ఖమ్మంరూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందనివ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మికులకు ఇస్తానన్న రూ.12వేలను మండలానికో గ్రామంలో మాత్రమే ఇచ్చారని, ఉపాధి హామీ పథకంలో 20 రోజులు పని చేసిన వారికి మాత్రమే రూ.12వేలు పథకం వర్తిస్తుందనడం సరికాదన్నారు. కేంద్ర బడ్జెట్ వల్ల పేదలకు ఒరిగిందేమీ లేదని, బడాబాబులకే ఉపయోగకరంగా ఉందని విమర్శించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఎర్ర శ్రీనివాసరావు, పి.సంగయ్య, పి.వెంకటేశ్వర్లు, పి.సుమతి, డి.రాంబాబు, పి.ఉపేందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకాలు..

● **ఖమ్మంవన్‌టౌన్:** తెలంగాణ రాష్ట్రంలో కులగణనను విజయవంతంగా పూర్తి చేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా జిల్లా ఓబీసీ సెల్ ఆధ్వర్యాన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాదికాలంలోనే బీసీ కులగణన చేసిన రాష్ట్ర నాయకత్వానికి ఓబీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొప్పెర సరిత ఉపేందర్, బాణాల లక్ష్మణ్, భారతీచంద్రం, సంపటం నర్సింహారావు, అబ్బాస్ బేగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే చెవెళ్ల డిక్లరేషన్‌లో భాగంగా ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసి, ఏకసభ్య కమిషన్‌ను నియమించినందుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, టీపీసీసీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ సోమ చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో జనాభా దామాషా ప్రకారం విద్య ఉద్యోగ రంగాల్లోనే కాక చట్టసభలు, నామినేటెడ్ పోస్టుల్లో మాదిగ జాతికి న్యాయం జరుగుతుందన్నారు.

● **మోదీ చిత్రపటానికి..**

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రధాని మోదీ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేకూరేలా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టడాన్ని హర్షిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యాన మోదీ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఈనేపథ్యాన మంగళవారం ముస్తఫానగర్ ఏపీజే అబ్దుల్ కలాం గుర్రాల సెంటర్ వద్ద రాష్ట్ర బీజేపీ నాయకుడు డాక్టర్ శీలం పాపారావు, పార్టీ జిల్లా కార్యాలయంలో పాలాభిషేకాలు చేశారు. రూ.12 లక్షల లోపు పన్ను మినహాయింపు, రైతులకు పంట రుణాలు రూ.3లక్షల నుంచి రూ.5 లక్షల వరకు పెంచడం, 60 ఏళ్లకు పైబడిన వారికి జీరో పన్ను మినహాయించిందన్నారు. ఈకార్యక్రమాల్లో బీజేపీ ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్ అధ్యక్షులు గడీల నరేష్, వెంకటనారాయణయాదవ్, నాయకులు సుబ్రహ్మణ్యం, విద్యాసాగర్, ఉపేందర్, సుబ్బారావు, భద్రం, గుత్తా వంశీ, మంద సరస్వతి, బోయినపల్లి శేఖర్, వీరవల్లి రాజేష్ గుప్తా, బచ్చు సతీష్, చింతమల్ల వీరస్వామి, బండ్ల రేగన్, కందుల శ్రీకృష్ణ, మట్టాదుర్గాప్రసాద్‌రెడ్డి, ప్రతాప్, రుద్ర ప్రదీప్, గాంధీ, మోహన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

గడ్డికి గడ్డుకాలం..!



మిషన్ ద్వారా కట్టిన వరిగడ్డి కట్టలు

పశువులకు పశుగ్రాసం కరువు

- యంత్రాలతో వరి కోతలే కారణం
- పాడి రైతులకు ఇబ్బందులు
- గడ్డి విత్తనాలు అందించాలని వేడుకోలు



వరి పంటను నూర్పిడి చేస్తున్న చైన్ మిషన్ (ఫైల్)


కామేపల్లి: ఈ ఏడాది వానాకాలం వరి సాగులో యంత్రాలతో కోతలు అధికంగా చేయడంతో తీవ్రంగా పశుగ్రాసం కొరత ఏర్పడిందని పాడి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో వానాకాలం సీజన్‌లో 6 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టినప్పటికీ పశుగ్రాసానికి కొరత ఏర్పడింది. దీంతో ఎండు గడ్డికి గిరాకీ పెరిగింది.

యాంత్రీకరణతో అవస్థలు..

గతంలో వరి పొలాలను వ్యవసాయ కూలీలతో కోయించేవారు. అనంతరం వారం పది రోజుల తర్వాత పడుగుపెట్టి ట్రాక్టర్ పడుగు తొక్కించి గడ్డి ఎదిరి కట్టలు కట్టి ధాన్యం దగ్గరకు పోసి ధాన్యాన్ని ఫ్యాన్‌తో తూర్పార పోసే పని విధానం అవలంబించే వారు. కానీ రోజు రోజుకు పెరుగుతున్న యాంత్రీకరణ వల్ల తక్కువ ఖర్చుతో సులువుగా పనులు పూర్తవుతున్నందున ఎక్కువ మంది రైతులు యంత్రాలతో పొలాలు కోయించారు. మెరక పొలాలను టైర్ల బండితో, బాడువా, ఒంపు పొలాలను చైన్ మిషన్‌తో కోయించారు. టైర్ల బండితో కోయించిన పొలాల్లో మాత్రమే కొంత గడ్డి చేతికి రాగా, చైన్ మిషన్‌తో కోసిన గడ్డంతా పాడైపోయింది. ఈ ఏడాది వర్షాలు అధికంగా కురవడంతో చెరువులు, కుంటల్లో సైతం నీరు సమృద్ధిగా ఉండడంతో మెరక పొలాలను సైతం చైన్ మిషన్‌తోనే పంట నూర్పిడి చేయాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో ఎక్కువ శాతం రైతులు చైన్ మిషన్లతోనే వరి కోతలు చేపట్టారు. దీంతో వరి గడ్డి రాకపోవడంతో పశుగ్రాసానికి తీవ్ర ఇబ్బంది ఏర్పడిందని పాడి రైతులు వాపోతున్నారు.

ఎండుగడ్డికి గిరాకీ..

కొంత మంది రైతులు తమ పొలాలను కూలీలతో కోయించి ఎకరం రూ.12వేల నుంచి 15 వేల వరకు గడ్డిని విక్రయిస్తున్నారు. దీంతో వరి గడ్డికి మంచి డిమాండ్ ఏర్పడింది. టైర్ల మిషన్ ద్వారా కోయించిన గడ్డిని గడ్డి మోపులు కంటే మిషన్ ద్వారా కట్టించి రైతులు ఇంటికి తరలిస్తున్నారు. టైర్ల మిషన్ ద్వారా కోసిన పొలంలో కేవలం ఎకరంలో 50 నుంచి 60 మోపుల గడ్డి మాత్రమే వస్తుందని రైతులు అంటున్నారు.దీంతో గడ్డి వ్యాపారం లాభసాటిగా ఉండటంతో కొందరు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి గడ్డిని తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గడ్డి కొనుగోలుకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తుందని పాడి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను అందించాలని రైతులు కోరుతున్నారు.



వరిగడ్డిని కట్టలుగా కడుతున్న కూలీలు

గతం కంటే పెరిగిన ధర..

వానాకాలం సీజన్‌లో వరి పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ పంట కోతలు మిషన్ల ద్వారా చేపట్టడంతో వరిగడ్డి కొరత ఏర్పడింది. దీంతో గడ్డికి మంచి డిమాండ్ ఏర్పడి గతం కంటే ఈ ఏడాది ధర పెరిగింది. ఒక ఎకరం గడ్డి రూ.12వేల నుంచి రూ.15 వేల వరకు పలుకుతుండగా పాడి రైతులకు పశుగ్రాసం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం గడ్డి విత్తనాలు అందిస్తే బాగుంటుందని రైతులు కోరుకుంటున్నారు.